# సాహసమా, వివేకమా, ఏది గొప్ప?

*Surya Prasad, Founder & CEO*

*Padala Charitable Trust, padalasurya@yahoo.com*

***ఎంత దూరమైనా వెళ్ళడం వేరు, ఎంత దూరం వెళ్ళాలో తెలియడం వేరు.***

***మొదటిది సాహసం, చాలా మందికి ఉంటుంది; రెండవది వివేకం, కొందరికే ఉంటుంది. వివేకవంతులే జీవితాన్ని గెలుస్తారు సాహస వంతులు కాదు.***

ఒసామా బిన్ లాడెన్ ఒక సాహసవంతుడు... ఎంత దూరమైనా వెళతాడు. అనుకున్న పని ఏదైనా చేసేస్తాడు. మరి డా. APJ అబ్దుల్ కలాం, వివేకవంతుడు... ఎంత దూరం వెళ్ళాలో, ఆ పరుగు ఎక్కడ ఆపాలో తెలిసినవాడు. ఎవరు గెలిచారు? ఎవరి వల్ల సమాజానికి మంచి జరిగింది? సాహసవంతుడా, వివేకవంతుడా?

మన పిల్లలు సాహస వంతులుగా ఉండాలా? వివేక వంతులు గానా లేక వివేకంతో కూడిన సాహసవంతులుగానా? ఈ రోజు మన విద్యా వ్యవస్థలో ఉన్న అతి ముఖ్యమైన లోపం మన పిల్లల్ని సాహసవంతులుగా తయారుచేస్తున్నాం, వివేకవంతులుగా కాదు. ఎలాంటి సాహసం అంటే, మామూలు సాహసం కాదు. తిండి, నిద్ర, ఆట, పాట లేకపోయినా మార్కులు, గ్రేడులు, ఎంట్రన్స్ పరీక్షల్లో ర్యాంకులు తెచ్చేసుకోవాలి. కోచింగ్ సెంటర్స్ కి లక్షలు ఖర్చు పెట్టాలి. పేపర్ లో ఫోటో వచ్చేయాలి. అవసరమైతే పక్కవాడిని తోసేసి పరిగెత్తాలి. IIT లో సీట్ కొట్టాలి. అక్కడకి వెళ్లి ఏం చెయ్యాలి? ఏదైనా చిన్న సమస్య వస్తే ఏ మాత్రం ఆలోచించకుండా ఒక ఎత్తైన భవనం మీద నుండి ధైర్యంగా దూకేయ్యాలి! అంత సాహసవంతులుగా తయారు చేస్తున్నాం మన పిల్లల్ని. పులి మీద స్వారీ చేయిస్తున్నాం, ప్రయాణం చాలా వేగంగా ఉంటుంది....కాని భయం భయం గా ఉంటుంది. ఎప్పుడు కావాలంటే అప్పుడు దిగలేని పరిస్థితి.

జీవితంలో **ఆనందం**గా ఉండటం అనే దానికి నిర్వచనాలే మార్చేసాం. 'బాగా' చదవాలిరా, పెద్ద ఉద్యోగం తెచ్చుకుని మన కుటుంబం పరువు నిలబెట్టాలి. అని చెబుతాం. కాని ఇక్కడ వచ్చిన చిక్కల్లా ఏంటంటే 'బాగా' చదవడం అంటే ఏంటి ? ఎక్కువ పుస్తకాలు చదవాలా? ఎక్కువ సేపు చదవాలా? ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలా? ఇష్టమైంది చదవాలా? అది మాత్రం చెప్పం. ఎందుకూ....మనకి కూడా ఆ విషయంలో క్లారిటీ లేదు కాబట్టి. క్లారిటీ లేదు అనే విషయం ఒప్పుకుని ఆ క్లారిటీ తెచ్చుకునే ప్రయత్నం చెయ్యం. కాని మన పిల్లలు మాత్రం ప్రపంచంలో అన్ని విషయాలు ఎలాగోలా అర్థం చేసేసుకుని మనం అనుకున్న స్థాయికి వెళ్లిపోవాలి...ఎలా వెళ్ళిపోతారు? మనకి లేని క్లారిటీ, మనకి లేని వివేకం పిల్లలకెలా వస్తుంది అది ఇంట్లో పిల్లలైనా, తరగతి గదిలో పిల్లలైనా?

నాకు తెలిసిన చాలా మంది ఉపాధ్యాయ మిత్రులు పిల్లల్ని మోటివేట్ చేసే ప్రయత్నంలో ఇలా అంటారు – 'ఏరా, బాగా కష్టపడి చదవండిరా....ఒక డాక్టరో, ఇంజనీరో, కలక్టరో, పోలీస్ ఆఫీసరో అయిపొండిరా...మన స్కూల్ కి మంచి పేరు తీసుకురండిరా''. అంటే అంతర్లీనంగా పిల్లలకి ఏం అర్థం అవుతుంది – ఓహో, చదువు అంటేనే కష్టం అన్నమాట, ఎందుకంటే కష్టపడి ఆడుకొండిరా, కష్ట పడి సినిమా చూడండిరా అని చెప్పరు. బాగా చదివితే ఒక డాక్టర్, ఇంజనీర్, కలెక్టర్, పోలీస్ అవ్వొచ్చు అన్నమాట. వాళ్లకి మాత్రమే సమాజంలో గౌరవం, గుర్తింపు ఉందన్న మాట. మరి బాగా చదవకపోతే ఒక టీచర్, ఒక నర్స్, వ్యవసాయం చేసుకునే ఒక రైతుగానో మిగిలిపోతానన్న మాట. లేకపోతే ఏ కిరాణా కొట్టో పెట్టుకుని బ్రతకాలన్న మాట. ఇదే కదా అంతర్లీనంగా మనం వాళ్ళ మనసుల్లోకి ఎక్కిస్తుంది. Just imagine how we are conditioning their belief system at that age.

# సాహసమా, వివేకమా, ఏది గొప్ప?

కేవలం కొన్ని వృత్తులు, కొన్ని ఉద్యోగాలు మాత్రమే గొప్పవి అనే భావాన్ని ఆ వయసులో జొప్పించడం ఎంత ప్రమాదకరం? వీళ్ళు ఎదిగిన తరువాత ఆనందంగా, ఆరోగ్యంగా ఉండగలరా? నలుగురితో కలిసి జీవించగలరా? ఎంత దూరం వెళ్ళాలి, ఎక్కడ పరుగు ఆపాలి అనే వివేకం ఉంటుందా, No Chance. అంటే భవిష్యత్తులో వాళ్ళు ఓడిపోవడానికి మనం పాఠశాల స్థాయిలోనే పునాది వేసేస్తున్నాం. We are preparing them to fail in life.

వ్యవసాయం చేసుకుంటూ, ఉన్న ఊళ్లోనే ఉంటూ పది మందికి అన్నం పెట్టే వృత్తి గొప్పదే కదా? సమాజానికి అవసరమైనదే కదా? కిరాణా కొట్టుతో ప్రయాణం మొదలుపెట్టి ఒక వ్యాపార వేత్తగా ఎదిగే అవకాశం ఉంది కదా? సమాజంలో అన్ని వృత్తులు గొప్పవే, సంపాదనతో సంబంధం లేకుండా ప్రతీ వృత్తినీ గౌరవించాలి. ఒక డాక్టర్ కి నమస్కారం పెట్టినప్పుడు, ఆ ప్రక్కనే నర్స్ ని కనీసం నవ్వుతూ పలకరించాలి కదా? కార్ దిగుతున్న కలెక్టర్ గారిని చూసి లేచి నిలబడినప్పుడు, ఆయన ను చాలా జాగ్రత్తగా తీసుకు వచ్చిన డ్రైవర్ కి ఒక షేక్ హ్యాండ్ అయినా ఇవ్వాలి కదా? కింది వాళ్ళు లేకపోతే పై వాళ్ళ పనులు ప్రశాంతంగా, సమర్ధవంతంగా చేసుకోగలరా? ఇదే కదా వివేకం అంటే?

‘*నీకిష్టమైన విషయం మీదే ఫోకస్ చెయ్యిరా నాన్నా, ఒత్తిడికి లోను కావద్దు. నా లాగే ఒక గొప్ప టీచర్ అవ్వు, 10 మంది డాక్టర్లను, 10 మంది ఇంజనీర్లను, కలెక్టర్ లను, పోలీసులను తయారు చేయొచ్చు. ఆ కిక్కే వేరురా*’ అని గర్వంగా తమ వృత్తి గురించి మాట్లాడే ఉపాధ్యాయులు ఈ రోజు ఎంతమంది ఉన్నారు మన వ్యవస్థలో? అది కదా వివేకం అంటే?

అంతెందుకు….అమ్మా, నీకు తెలుగు టీచర్ అవ్వాలని ఉంది కదా? తెలుగులో 10/10 తెచ్చుకో; పద్యాలు, కథలు చదువు, సొంతంగా రాయి. మన లైబ్రరీ లో ఉన్న తెలుగు పుస్తకాలు ఇంటికి పట్టుకు వెళ్ళు. తెలుగు మీదే ఎక్కువ సమయం గడుపు. ఇంగ్లీష్, మాథ్స్ లో నీకు 10/10 అక్కర్లేదు. అవి జస్ట్ పాస్ అయితే సరిపోతుంది. తెలుగు నీ passion కాబట్టి దానిమీదే ఎక్కువ సమయం కేటాయించు. అని ఏ HM, DEO, Collector అయినా బాహాటంగా చెప్పిన దాఖలాలు ఏమైనా ఉన్నాయా? పిల్లల ఆసక్తి, ప్రతిభ పట్టించుకోకుండా, కేవలం % కోసం, గ్రేడుల కోసం పిల్లల మీద ఒత్తిడి తెచ్చి, పరీక్షల్లో అక్రమాలు ప్రోత్సహించే ఎవ్వరైనా సరే పిల్లలకు, తద్వారా సమాజానికి ద్రోహం చేస్తున్నట్టే. అటువంటి వాళ్ళు ఎంత గొప్ప వాళ్లైనా విద్యా రంగంలో, అదీ పిల్లల మధ్య ఉండే అర్హత లేదు.

మన వ్యవస్థ ఎలా ఉన్నా సరే, మన పిల్లలు వివేక వంతులు గా, విద్యావంతులుగా ఎదుగుతున్నారా, లేదా అనే విషయం ప్రతీ ఒక్క తల్లి, తండ్రి ఆలోచించాలి. స్కూటర్ ని సర్వీసింగ్ కి ఇచ్చినట్టు పిల్లలని బడికి, కాలేజీ కి పంపడం కాదు పేరెంటింగ్ అంటే. వాళ్ళ ప్రతీ ఆలోచనలో, ప్రవర్తనలో మనం కనపడాలి. డిగ్రీలలో, ఉద్యోగాల్లో, సంపాదనలో కాదు….ఆశయాలలో, మనిషితనం లో మన పిల్లలు మన కన్నా ఎత్తులో ఉండాలి. మనం సెల్యూట్ చేసే స్థాయిలో ఉండాలి….అది సక్సెస్ అంటే.

ఇదంతా ఏదో పుస్తకంలో చదివి చెప్పడం లేదు….నేను మా ఇద్దరి అమ్మాయిలని చూసే, పెంచే విధానంలో నేను నేర్చుకున్న సంగతులు, ఆచరిస్తున్న విషయాలు దృష్టిలో పెట్టుకుని రాస్తున్నాను. వాళ్ళు నా కన్నా ఎక్కువ ఆస్తులు సంపాదించలేక పోవచ్చు…కాని ఖచ్చితంగా నా కన్నా ఎక్కువ ఆనందంగా ఉంటారు, సాహసవంతులుగా ఎదగక పోవచ్చు, కాని వివేకవంతులుగా ఎదుగుతారు. **ఒక పేరెంట్ గా అంత కన్నా ఏం కావాలి?** మీరు కూడా ఈ విషయం గురించి ఆలోచించి మీ అభిప్రాయాలు , అనుభవాలు పంచుకోండి.